ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు


కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా, కార్పొరేటర్ రోజా రంగారావు

హఫీజ్‌పేట్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారాకరామారావు జన్మదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చందానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీగా హాజరయ్యారు. ముఖ్య అతిథులు హాజరైన గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సాయిబాబా, వివేకానందనగర్ కార్పొరేటర్ రోజా రంగారావులు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. అనంతరం మ్యాగజీన్‌ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం యాదవ్, మాల్లారెడ్డి, రవి యాదవ్, బీఎస్ఎన్ కిరణ్, భాస్కర్‌రావు, హరిశ్‌రావు, జంగయ్య యాదవ్, దారుగుపల్లి నరేషా, అంజమ్మ, రాజు, అశోక్ యాదవ్, నారాయణ, రమేష్ గౌడ్, శ్రీనివాస్, తిరుమలేష్, అనిల్ సింగ్, ఖాదర్ ఖాన్, మక్బుల్, ప్రభాకర్, రామకృష్ణ, రోజా, శ్రీలత రెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

- పగలూ వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు
- విద్యుత్ ఆదాపై కొరవడిన చిత్తశుద్ధి
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం


హిమసాయి లేక్ వ్యూ నుంచి వికాస్ ఎఫిస్టిమో స్కూల్ చౌరస్తా వరకు స్ట్రీట్ లైట్లు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో స్ట్రీట్ లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఉన్నట్టా... లేనట్టా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. స్ట్రీట్ లైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగులు విరజిమ్ముతున్నా సదరు విభాగం అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో హిమసాయి లేక్ వ్యూ నుంచి వికాస్ ఎఫిస్టిమో స్కూల్ చౌరస్తా వరకు ఉన్న రోడ్డులో ఇరువైపులా స్ట్రీట్ లైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండటంతో విద్యుత్ దుబారా అవుతోంది. జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో ఈ సమస్య పునరావృతం అవుతున్నా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ స్ట్రీట్ లైట్ల నిర్వహణపై వెంటనే దృష్టి సారించి విద్యుత్ దుబారా కాకుండ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదరహితంగా బస్సులు నడపాలి

గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

రాయదుర్గం: ప్రమాదరహితంగా అత్యంత సురక్షితంగా ఆర్టీసీ బస్సులను నడపాలని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు డ్రైవర్లకు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో ఆవరణలో ప్రమాదరహిత వారోత్సవాలను బుధవారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రోడ్డు నిబంధనలను విధిగా అందరూ పాటించాలని కోరారు. నిబంధనలను అనుగుణంగా నడవడంతోనే ప్రమాదాలను అరికట్టవచ్చని, అందుకు అందరూ పోలీసులతో సహకరించాలన్నారు. డ్రైవర్లుగా విధులను నిర్వహించే వాళ్ళు తమ డ్యూటీ చేసే సమయంలో ప్రశాంతంగా ఉంటూ బస్సులను నడపాలన్నారు. ప్రమాదరహితంగా బస్సులను నడిపిన వాళ్ళను మిగతా వారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏటా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రమాదరహితంగా వాహనాలను నడపాలనే భావన అందరిలోనూ కలిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఏఈ రహమాన్, సూపరింటెండెంట్ లక్ష్మీ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇసాక్‌తోపాటు పలువురు డిపో డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

పౌరులంతా మొక్కలు నాటాలి


అమీన్‌పూర్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: పట్టణంలోని పౌరులందరూ మొక్కలు నాటాలని అమీన్‌పూర్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని సాయి అంబిక ఫేస్–1 కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాజేశ్వరి ఫేస్ 2 కాలనీలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పారిశుద్ధ్య కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్ కల్పన ఉపేందర్‌రెడ్డి, కృష్ణ, కోఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, సీనియర్ నాయకుడు కొల్లూరు యాదగిరి, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

జోగిపేట(అందోల్): అందోల్ – జోగిపేట మున్సిపాలిటీలో వనమహోత్సంలో భాగంగా జోగిపేటలోని 10, 11, 12, 13 వార్డుల్లో బుధవారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతీవార్డులో ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన మొక్కలను నాటాలని కమిషనర్ సూచించారు. నాటిన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమములో చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, వార్డు కౌన్సిలర్లు రేఖ ప్రవీణ్, నాగరాజు, రంగా సురేష్, మున్సిపల్ సిబ్బంది, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, మెప్మా సీఓ. భిక్షపతిగౌడ్, మెప్మా ఆర్‌పీలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రోడ్లన్నీ బురదమయం..
ప్రయాణం నరకప్రాయం

- ప్రమాదకరంగా మారిన చందానగర్ మంజీరా రోడ్డు
- రోడ్డు మరమ్మతులపై పట్టించుకునే అధికారి కరువు


గుంతలమయంగా తయారైన చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్‌ల పరిధిలోని మంజీరా రోడ్డు

హఫీజ్‌పేట్: వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లోని రహదారులపై ఉన్న చిన్నచిన్న గుంతల్లో నీరు చేరి అవికాస్తా పెద్దవై పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నాయి. పలు సందర్భాల్లో వాటివల్ల ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి.

- చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డు వర్షాలకు పూర్తిగా చిత్తడిగా, బురదమయంగా మారి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. లింగంపల్లి బీఆర్ గ్యాస్ ఏజెన్సీ నుంచి మొదలుకొన్న రోడ్డు చందానగర్, గంగారం, హుడాకాలనీ, ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డు భారీ వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారాయి. రోడ్డుపై ఎక్కడ ఏ గుంత ఉందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలు మాత్రం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇక పాదచారులు మాత్రం రోడ్డు పక్కన నడవాలంటే ఎటువైపు నుంచి వాహనాలు వస్తాయో బురద నీరు పడుతుందో అని ఆందోళన చెందుతున్నారు.
- చందానగర్ సర్కిల్ 21 పక్కనే ఉన్న అంబేద్కర్ కళ్యాణ మండపం ఆవరణ పూర్తిగా బురదమయంగా మారింది. అధికారులు వచ్చే వాహనాలే బురదలో పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వైపు నూతన మంజీరా పైప్‌లైన్ పనులు.. మరో వైపు వర్షాలు.. రోడ్డంతా గుంతలు.. రోడ్డుపై వెళ్లాలంటేనే నరక ప్రాయం అవుతోందని స్థానికులు వాపోతున్నారు.
- చందానగర్‌లోని ముంబయి జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న సందర్భంగా మంజీరారోడ్డుపై భారీగా పెరిగిన ట్రాఫిక్‌తో దుకాణదారులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఉదయం, సాయంత్రం సమయాలలో వాహనాల రద్దీ వల్ల శబ్ద కాలుష్యం తీవ్రతరమయ్యిందని వాపోతున్నారు.



పరిష్కరించాలంటే...

- భారీ వర్షాలకు గుంతలుగా ఏర్పడ్డ మంజీరా రోడ్డుపై జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ టీంలతో తాత్కాలిక మరమ్మతులు చేయాలి.
- రోడ్డు విస్తరణ చేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.
- మంజీరా రోడ్డుపై అక్రమంగా దుకాణాల ముందు పార్కింగ్ చేస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.
- గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రత్యేక నిధుల ద్వారా నూతనంగా సీసీ రోడ్డు వేయాలి.
- రోడ్డుకు ఇరువైపుల నో పార్కింగ్ సూచిన బోర్డులు ఏర్పాటు చేయాలి.
- 100 ఫీట్లకు మంజీరా రోడ్డు విస్తరణ అనుమతులు ఉన్నాయి. వాటిని అమలు చేసి రోడ్డు విస్తరణ చేయాలి.
- నూతన మంజీరా పైప్‌లైన్ పనులు పూర్తి చేసిన చోట తక్షణమే మరమ్మతులు చేయాలి.
- వర్షా కాలం దృష్ట్యా బురదమయంగా మారిన రోడ్డులో మట్టితో సరిచేయాలి.

నేటి నుంచి మెదడువాపు టీకా

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్ వాడీ సెంటర్లలో మెదడువాపు టీకా (జేఈ వాక్సిన్) గురువారం నుంచి ఇవ్వనున్నట్లు శేరిలింగంపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ సీహెచ్‌ఓ స్వామి తెలిపారు. మెదడు వాపు టీకా కార్యక్రమం ఆగస్టు 15 తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ టీకా 9 నెలల చిన్నారుల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు వేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని 59 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత,, జిల్లా పరిషత్ స్కూల్స్‌లలో, 64 అంగన్ వాడీ సెంటర్స్‌లలో టీకాలు ఇస్తారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో 26,478 మందికి పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమంలో 24 మంది ఏఎన్ఎంలు, 73 మంది ఆశలు, ఇద్దరు సూపర్ వైజర్స్ పాల్గొంటారని తెలిపారు.

జెడ్సీని కలిసిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను జోనల్ కార్యాలయంలో బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గాలైన ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి పార్టుల్లో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అధిక మొత్తంలోనిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, పనుల్లో వేగం పెంచాలని కోరారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా చెరువుల సుందరీకరణ, పార్కులు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలపై జెడ్సీ అపూర్వ చౌహాన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి


మాట్లాడుతున్న నాగభూషణం

మియాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐయూ పొలిట్ బ్యూరో సభ్యుడు నాగభూషణం డిమాండ్ చేశారు. మియాపూర్‌లోని ఎంఏనగర్ ఎంసీపీఐయూ కార్యాలయంలో 2వ రోజు రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసి పోరాడేందుకు కమ్యూనిస్టులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నియంతృత్వ మనువాద కార్పొరేట్ పాసిస్ట్ దోపిడీ పాలకవర్గంకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని అందులో భాగంగా ఎంసీపీఐయూ ఆర్ఎంపీఐలతో కమ్యూనిస్టు కో – ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ఏకం కావాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెవు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, సుకన్య, వెంకన్న, హంసారెడ్డి, తుకారాంనాయక్, గోనే కుమారస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంగ్ ఫూ క్రీడాకారులకు సన్మానం


కుంగ్ ఫూ క్రీడాకారులను సన్మానిస్తున్న కొండా విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్: నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ పోటీలలో చందానగర్ పీజేఆర్ స్టేడియంకు చెందిన కుంగ్ ఫూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుంగ్ ఫూ క్రీడాకారులను చైర్మన్ కొండా విజయ్‌కుమార్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రతి ఒక్క క్రీడాకారులను ప్రోత్సహం అందిస్తానన్నారు. అనంతరం క్రీడాకారులకు రూ. 10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. క్రీడాకారులకు ఎల్లప్పుడూ హోప్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. పతకాలు సాధించిన వారిలో పూజితకు 3 బంగారు, నటేశ్వర్, బాలాజీ, మహీర్ ఒకొక్క బంగారు పతకం, రాజు రాయన్, వేదిక, గీతాకృష్ణ, బిందు, రుత్విక్ వెండి పతాకలు సాధించారన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ పార్టు, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ల పరిధిలో చేపట్టవలసిన పనులు, పలు సమస్యలపై డీసీ కృష్ణయ్య, డీసీ మోహన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి, టౌన్ ప్లానింగ్, వీధిలైట్లు, శానిటేషన్ అన్ని విభాగాల అధికారులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ, అన్ని విభాగాల అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలపై అధికారులు నిర్లిప్తతను వీడాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై స్పందించాలన్నారు. ప్రజావసరాల దృష్ట్యా కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకొని త్వరగా పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుంఅ అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు మాన్‌సూన్‌సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలని, అవసరమున్న చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు తెలిపారు. ప్రజలకు అవసరమైన పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణలో క్షేత్ర స్థాయిలో అసంపూర్తిగా పనిచేస్తున్నారని, ప్రజలకు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా, ఇబ్బంది కలిగించే విషయంలో ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులకు తెలిపారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు.

శ్మశానవాటికలో మెరుగైన వసతులు కల్పించండి

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్, బి.శ్రీను మాట్లాడుతూ.. ఆలి తలాబ్ వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి లైట్లు వేయాలన్నారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. బస్తీ రోడ్డు నుంచి శ్మశానవాటిక వరకు సిమెంట్ రోడ్డు వేయాలన్నారు. శ్మశానవాటికలో నిర్మించిన రూమ్‌ను పగలగొట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పోలీసులు గస్తీ పెంచాలన్నారు. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అలీ తలాబ్ చెరువులోని గుర్రపుడెక్కని తొలగించి, దోమల నుంచి స్థానికులను కాపాడాలని డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానాలో సిస్టర్ లేకపోవంతో రక్త పరీక్షలు జరగటం లేదని, వెంటనే బస్తీ దవాఖానాలో సిస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు మహేష్‌గౌడ్, వెంకటేష్, శ్రీరాములు, రాజు, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ దారుణ హత్య

- కూలి డబ్బులు చెల్లించే విషయంలో వివాదం
- సుత్తితో తలపై మోది హత్య
- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు


హత్యకు గురైన రాజేష్ కుమార్

గచ్చిబౌలి: సత్తితో తలపై మోది వలస కూలీని దారుణంగా హత్య చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, మహరాజ్‌గంజ్ జిల్లా, సమర్‌ఘర్ గ్రామానికి చెందిన రాజ్ కుమార్(44) మూడు నెలల క్రితం వట్టినాగులపల్లికి వలస వచ్చి అక్కడే నివాసం ఉంటున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులను తనతోపాటు తీసుకొచ్చి పెయింటింగ్ పనులు చేయిస్తున్నాడు. కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తూ భవన యజమానుల నుంచి డబ్బులు తీసుకొని తోటి కూలీలకు ఇవ్వడంలేదు. కొద్ది రోజులుగా డబ్బులు ఇవ్వాలనే విషయంలో కూలీలలకు, రాజ్‌కుమార్‌కు గొడవ జరుగుతోంది. మంగళవారం రాత్రి అందరు కలిసి మద్యం తాగి డబ్బుల విషయంలో గొడవపడ్డారు. కూలీలు గదిలో పడుకోగా, వరండాలో రాజ్‌కుమార్ నిద్రకు ఉప క్రమించాడు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో వెనకాల నివాసం ఉండే రాజస్తాన్‌కు చెందిన కూలీలు రాజ్‌కుమార్ హత్యకు గురయ్యాడని ఇంటి యజమాని గబ్బర్‌సింగ్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలపై సుత్తితో మోదడంతో రక్తపు మడుగులోనే ప్రాణాలు వదిలాడని, రాత్రి 11 గంటల తరువాత హత్య జరిగి ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆరుగురు కూలీలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, రాంసింగ్ అనే వ్యక్తి హత్య చేసినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయ్యిందని పోలీసులు తెలిపారు. మిగతా వారి పాత్రపై దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు ఉత్తరప్రదేశ్‌లోనే ఉంటారని చెప్పారు. ఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్, ఎస్‌లు సందర్శించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం


ప్రకాష్

మియాపూర్: వృద్ధాశ్రమంలోని ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు సమాచారం మేరకు... ప్రకాష్(70) మియాపూర్ మదీనాగూడ దీప్తీశ్రీనగర్ కాలనీలో గోల్డేజ్ రిటర్మెంట్ హోంలో ఈ నెల 19వ తేదీన కుటుంబ సభ్యులు చేర్చారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో గోల్డేజ్ హోం నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో గోల్డేజ్ హోం సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుమార్తె ఇంద్ర ఓంకార్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎవరికైనా ప్రకాష్ వివరాలు తెలిస్తే మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి అరుదైన అవకాశం


హెచ్‌సీయూ పీహెచ్‌డీ విద్యార్థిని షేక్ ఆయేషా

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని పరిశోధక విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలో పరిశోధక విద్యార్థిని షేక్ ఆయేషాకు రష్యాలో జరిగే బ్రిక్స్ యూత్ సమ్మిట్–2024లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఆమె తన పీహెచ్‌డీని హెచ్‌సీయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు యరగొర్ల ఆధ్వర్యంలో చేస్తున్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన ఈ సమావేశం 26వ తేదీ వరకు రష్యాలోని ఉలియానోవ్స్క్‌లో కొనసాగుతుంది. అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించడానికి యువతలో చైతన్యం తీసుకురావడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువనాయకులను వివిధ ప్యానెల్ సెషన్లు, చర్చా సెషన్లలో నిమగ్నం చేయడం ద్వారా బ్రిక్స్ ద్వారా దాని మరింత ప్రజాస్వామ్యీకరణను నిర్ధారించడం ప్రధాన ఎజెండాగా ఉంటుంది.

బీజేపీలో పలువురి చేరిక



రాయదుర్గం: అభివృద్ధిలో బీజేపీకి ఎవరూ సాటిరారని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పలిలోని ఆయన కార్యాలయంలో గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పలువురు బీజేపీలో చేరారు. వారికి బీజే కండువాలను ఆయన కప్పి బుధవారం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి అనేక మంది బీజేపీలో చేరుతున్నారన్నారు. బీజేపీలో రాజు, సత్య, శ్రీకాంత్, రాజేష్, రామకృష్ణ, కుమార్, గిరి, సుమన్, మణికంఠ, శ్రీశైలం, వెంకటేషులు చేరగా వారికి పార్టీ కండువాలను గంగాధర్‌రెడ్డి కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శేఖర్, ప్రభాకర్, ప్రకాశ్, మహేష్, రమేష్, రంగస్వామి, చిన్న, నర్సింగ్‌రావు, శ్రీకాంత్, మధు, నర్సింహ్మా, గోవర్ధన్, సింధు, విష్ణు, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

చెత్తతో నిత్యం ఇబ్బందులే...


నానక్‌రాంగూడలోని రేషన్‌షాప్ చేరువలో పేరుకుపోయిన చెత్త

రాయదుర్గం: చెత్తతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని నానక్‌రాంగూడవాసులు వాపోతున్నారు. చెత్త పేరుకపోయిన చోట రెండు చనిపోయిన ఎలుకలు, ఒక పిల్లి మృతదేహాలు ఉన్నాయి. వాటిని వెంటనే అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. నానక్‌రాంగూడలోని రేషన్‌షాప్ చేరువలో ఈ చెత్త పేరుకపోగా అందులోనే వీటిని అక్కడ పారవేయడంతో దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు. వర్షాలకు వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించి వెంటనే తొలగించి దుర్వాసన నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.